

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33 (మంగళవారం)
కనిష్ఠం : 27

మహానాడులో మనోళ్లు!


» నిర్వహణ కమిటీలో నేతలకు ప్రాధాన్యం
» తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల

రాజమహేంద్రవరం/అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికార తెలుగుదేశం పార్టీ ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు సంబంధించిన కమిటీల్లో ఉమ్మడి జిల్లా వారిలో పలువురికి చోటుదక్కింది. మొత్తం 19 కమిటీలను నియమించగా, రెండు కమిటీలకు కన్వీనర్లను ఉమ్మడి జిల్లా నేతలకు అప్పగించడం గమనార్హం. పలు కమిటీల్లో పలువురు ఎమ్మెల్యేలు, నేతలకు ప్రాధాన్యత లభించింది. మాజీ ఆర్థికమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సభా స్థలంలో సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియమితులయ్యారు. భోజనాల కమిటీ కోకన్వీనర్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) నియమితులయ్యారు. రవాణా కమిటీ సభ్యుడిగా గోపాలపురం ఎమ్మెల్యే, బడ్జెట్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడు మద్దిపాటి వెంకటరాజు నియమితులయ్యారు. సభా ప్రాంగణం పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు స్థానం దక్కింది. అలాగే సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక సమితి కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, జన సమీకరణ కమిటీ సభ్యుడిగా అమలాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సభ్యుడు అయితాబత్తుల ఆనందరావును నియమించారు.


యనమల రామకృష్ణుడు


మంత్రి వాసంశెట్టి సుభాష్

తీరాన... అందాల హరివిల్లు!



6



చిరు జల్లులు : కాకినాడ నగరంలో కురుస్తున్న వాన

వానావరణం!

ఎండా పోయి.. వాన వచ్చే ఢాం ఢాం

» ఉదయం నుంచి వదలని వాన
» వరుణుడి దెబ్బకు భానుడు పరార్
» కాకినాడ జలమయం
» కరపలో అత్యధిక వర్షపాతం
» నేడు, రేపు కూడా వానలు
» ఊపిరిపీల్చుకున్న జనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్ర ఎండలు.. భరించలేని వేడి.. ఉక్కబోతతో అల్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షాలు ఉపశమనం కలిగించాయి. తెల్లవారుజాము నుంచీ రోజంతా అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి కుండపోతగా వానపడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. గడచిన కొన్ని వారాలుగా ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టి సాయంత్రానికి చినుకులు పడుతున్నాయి. దీంతో రోజులో సగం ప్రజలు వేడి, ఉక్కబోతతో నరకం చూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారింది.అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వాన కురిసింది. కొన్నిచోట్ల అయితే మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయి. దీంతో రోజంతా ఎండమాయమై చల్లని వాతావరణం కొనసాగడంతో జనం ఉపశమనం పొందారు. కాకినాడ నగరంలో భారీ వర్షం పడడంతో మెయిన్ రోడ్డు, మసీదుసెంటర్, లోతట్టు ప్రాంతాలన్నీ మోకాల్లోతు నీటిలో మునిగాయి.అనేక ఇళ్లల్లోకి సైతం నీరు వచ్చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కాకినాడ నగరంలో ఏకంగా 7.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కరప మండలంలో ఏకధాటిగా వానపడడంతో రాష్ట్రంలోనే అత్యధికంగా 8.5 సె.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం ధాటికి అనేక రహదారులు మునిగాయి. పంటచేలల్లోకి నీరు వచ్చి చేరింది. కాకినాడ రూరల్‌లో 5.5 సెం.మీ. నమోదైంది. కోనసీమ జిల్లాలోని మండపేటలో అతి తక్కువ వ్యవధిలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా పెదపూడిలో 5, కాజులూరు మండలం ఆర్యవటంలో 4.8, పిఠాపురం, తాళ్లరేవు, రౌతులపూడిలో 2, కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 4.4, కపిలేశ్వరపురంలో 3.6, ఆలమూరు 2.1, ఆత్రేయపురం 1.2, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 2, బిక్కవోలు 1.8, అనపర్తి 1.7 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మరోపక్క రుతు పవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు, రేపు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.


అబ్బబ్బా ఇదేమి వాన : కరపలో నీట మునిగిన ఎంపీడీవో కార్యాలయం


ఈ వాహనాలకు ఇక పనిలేదు..

రేషన్.. ఏ డోద్దు!

ఇకపై ఎప్పుడు కావాలంటే అప్పుడే రేషన్

» ఇక అక్రమాలకు బ్రేక్
» ఎండీయూ వాహన సేవలు రద్దు
» క్యాబినెట్‌లో నిర్ణయం
» ఉమ్మడి జిల్లాలో 1,139 వినియోగం
» రూ.66.19 కోట్లతో కొనుగోలు
» ఇంకా 20 నెలల రుణం బాకీ
» 2,857 దుకాణాల్లో రేషన్

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎండీయూ వాహన సేవలకు ప్రభుత్వం మంగళం పాడేసింది.పేదలకు బియ్యం పంపిణీ పేరుతో నాలుగున్నరేళ్ల వైసీపీ సేవలో తరించిన వాహనాలు ఇకపై రద్ద య్యాయి. ఇన్నేళ్లు కొనసాగుతున్న దందాకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రేషన్ బియ్యం ఇకపై రేషన్ దుకాణాల్లోనే తెచ్చుకునే వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం ప్రకటించింది.

1 నుంచి దుకాణాల వద్దే..

లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసరాలు అందించేందుకు గతంలో ఉండే చౌక డిపోల వ్యవస్థను జూన్ 1వ తేదీ నుంచి తిరిగి పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై కార్డుదారులు నేరుగా తమ పరిధి లోని రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవచ్చని తెలిపింది. కాకినాడ జిల్లాలో 1,060 రేషన్ దుకాణాల్లో 6.43 లక్షల మంది కార్డుదారులు రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38 లక్షల మంది కార్డుదారులు, తూర్పుగోదావరి జిల్లాలో 871 దుకాణాల ద్వారా 5.65 లక్షల మంది కార్డుదారులకు ప్రభుత్వం నెలకు ఉమ్మడి జిల్లాలో 26 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేయనుంది. ఇకపై 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా లబ్ధిదారుడు చౌక దుకాణం వద్దకు వెళ్లి నేరుగా బియ్యంతో సహా ఇతర నిత్యావసర వస్తువులు పొందే అవకాశం ఉంది. దీనికితోడు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టనుంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా చౌకడిపో డీలర్లు చేస్తున్న ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు బ్రేక్ వేశారు..

నెలలో తమకు కావాల్సిన సమయంలో కార్డుదారులు రేషన్‌దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం అమలవుతుండగా..గత వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికీ బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆనక మాట మార్చేసింది. ఒక కాలనీకి వెళ్లి ఈ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీ వాసులు వాహనం ఎదుట నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది. ఆ రోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయినట్టే.ఈ వాహనం పేరుతో సదరు ఆపరేటర్లు కార్డుదారులపై రుబాబు చేసేవారు. బియ్యం ఇచ్చినట్టే ఇచ్చి అక్కడే తిరిగి కొనుగోలు చేసేవారు.ఆ బియ్యం తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్ మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి.ఇదే విషయాన్ని మంగళవారం నాటి క్యాబినెట్ సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎం డీయూ వాహనాలను రద్దు చేసింది.

కోట్లలో దుర్వినియోగం..

గత వైసీపీ ప్రభుత్వం సొంత ప్రచారానికి రేషన్‌దుకాణాలను నిర్వీర్యం చేసి ఈ ఎండీయూ వాహనాలను రుద్దింది. ఒక్కో వాహనాన్ని రూ.5.81 లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72 నెలల వాయిదాపై బ్యాంకు నుంచి 2021 ఫిబ్రవరిలో రుణం తీసుకుంది.కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19 కోట్ల రుణం ద్వారా కొనుగోలు చేసింది.ఇప్పటికీ ఈ రుణాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది.ఇంకా ఇరవై నెలల బాకీ బ్యాంకుల్లో ఉంది. ఇప్పుడు ఈ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రూ.6.83 కోట్లు అప్పు తీర్చాల్సి ఉంది. ఈ ఎండీయూ వాహనాలను నడుపుతున్న వ్యక్తుల ఉపాధికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వారికి ఆ వాహనాలను ఉచితంగానే అప్పగించడం ద్వారా ఎండీయూ వాహనాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది.

రేపు టీడీపీ జిల్లా మినీ మహానాడుకు సన్నాహాలు

కాకినాడ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వివేకానంద పార్కు వద్ద గోదావరి కళాక్షేత్రంలో గురువారం టీడీపీ జిల్లా మినీ మహానాడు-2025 నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. జిల్లాలోని నియోజకవర్గాల మినీ మహానాడుల్లో చేసిన తీర్మానాలను జిల్లా మినీ మహానాడులో ఆమోదించి రాష్ట్ర మహానాడుకు పంపనున్నారు. ఏర్పాట్లపై జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు.

ఐసెట్ ఫలితాల్లో జిల్లా 1700 మంది ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 7న ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఏపీఐసెట్-2025 ఫలితాలకు సంబంధించి జిల్లాలో 96.96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లావ్యాప్తంగా 1,747 మంది విద్యార్థులు హాజరుకాగా, 1700 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 1051కుగానూ 1019 మంది, బాలుర విభాగంలో 696 మంది హాజరుకాగా 631 మంది అర్హత సాధించారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు : జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీ ప్యాట్స్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం గోదాముల భద్రతకు చేపడుతున్న చర్యలను మంగళవారం ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ తహశీల్దారు జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దారు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది.. తెలుగుకు వెలుగొచ్చింది.. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గోదావరి ప్రజల కోరిక తీరింది.


తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ప్రధాన ద్వారం

తెలుగు..వెలుగు!

» పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి ప్రాణం
» సీఎం చొరవతో కేబినెట్ ఆమోదం
» రాజమండ్రిలో ప్రధాన కార్యాలయం
» 1986లో పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
» గోదావరి జిల్లాల్లో హర్షాతిరేకాలు
» రాష్ట్ర విభజన తర్వాత తొలి వర్సిటీ
» 55 ఎకరాలు ఇస్తే మిగిలింది 20

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉనికి కోల్పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు, ఏపీలోని తెలుగు వర్సిటీకి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానమైంది. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. బొమ్మూరులోని తెలుగు పీఠంలో 2024- 25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ నెల 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తవడంతో ఈపీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది.దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం చిగురించింది. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు రాని పరిస్థితి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్‌డీని నియమించి జీతాలు ఇస్తున్నారు.

1986లో ఆరంభించిన ఎన్‌టీఆర్..

తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతం రాజమహేంద్రవరం..ఈ నేపథ్యంలో 1986 ఏప్రిల్‌లో తెలు గుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీఆర్ తెలుగు భాషను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయంలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు స్వయంగా శంకుస్థాపన చేశారు.శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో బొమ్మూరు కొండ మీద సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ నిర్మించారు. బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది. విభజన నేపథ్యంలో పీఠం శిథిలస్థితికి చేరింది. క్యాబినెట్ నిర్ణయంతో మళ్లీ జీవం పోసుకుని ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియ మితులయ్యారు. ఎండ్లూరి సుధాకర్ హయాంలో రాష్ట్ర విభజన రావడంతో ఇది పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ తెలుగు ఎంఏ,ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వ హించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. తర్వాత 30కి పెరిగింది. ఆరుగురు టీచింగ్ స్టాఫ్, 12 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేవారు. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు మొదటి ఎంఫిల్ పట్టాపొందారు.ప్రముఖకవి అద్దేపల్లి రామ్మోహన రావు, విమర్శ కుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. మారిషస్ దేశం నుంచి వచ్చి ఇద్దరు ఇక్కడ పీహెచ్‌డీలు చేశారు.ఇక్కడ 300 మంది పీహెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. సుమారు 550 మంది తెలుగు ఎంఏ చేశారు. కాలువ మల్లయ్య వంటి ప్రముఖ కథా రచయితలు ఇక్కడ గోష్ఠుల్లో పాల్గొనడం గమనార్హం. ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. భవనాలు సుమారుగా శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల భూమి మిగిలింది. 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం ఉంది.


చిట్టడవిలా ప్రధాన భవనం ఆవరణ

కేబినెట్‌లో ఏం జరిగిందంటే..

అమరావతిలో మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చట్టం 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాలను నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది. రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ ఏర్పాటుపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.


చెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నేతలు, కార్మికులు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దుచేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పరిశ్రమల యాజమానులకు, కార్పొరేటర్లకు లాభదాయకమన్నారు. దేశంలో కష్టించి పనిచేసే 90శాతం ప్రజలైన కార్మికవర్గానికి, ఉద్యోగులకు, అసంఘటిత రంగ కార్మికులకు ఉరితాడు వంటిదని విమర్శించారు. కేంద్రంలో ఉన్న 11 కార్మిక సంఘాలు ఉమ్మడిగా జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె చేసి ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ ఏపీ-తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శి తాళ్లూరు రాజు, పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్తిరాజు, మలకా రమణ, పలివెల వీరబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాపై అవగాహన : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి నెల రోజులపాటు యోగా ఆంధ్ర- 2025లో భాగంగా యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో యోగా అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో యోగా ఆంధ్ర-2025ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లా ప్రజలందరికీ యోగాపై అవగాహన, ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలకు నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో, మున్సిపాల్టీల్లో జరిగే కార్యక్రమాలకు కాకినాడ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు భాగస్వాములు కావాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, పాడా పీడీ చైత్రవర్షిణి, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.


తీరాన... అందాల హరివిల్లు!



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సాగర తీరం

కాకినాడ టు కోనసీమ చుట్టొచ్చేద్దామా

పర్యాటకులకు ఇదొక చక్కని అనుభూతుల లోగిలి



అటు సముద్రం.. ఇటు గోదావరి. ఆ అంచున కడలి కెరటాలు.. వేటకెళ్లే బోట్లు.. ఈ అంచు గట్టున ప్రకృతిలో ఓలలాడే చిరుగాలులు.. గోదారి పరవళ్లు. ఎటువెళ్లినా నీళ్లే.. అందాల హరివిల్లు చూడాలంటే ఇటు కాకినాడ వైపు.. అటు కోనసీమ వైపు వెళితే చాలు. ఒక్కోచోట ఒక్కో అందం.. ప్రకృతి సోయగాల మధ్య సేదతీరాలనుకునే వారికి ఇంతకంటే గొప్ప అనుభూతినిచ్చే ప్రదేశాలు ఉండవేమో. పర్యాటకులను ఉల్లాసపరిచే, వారికి ఆహ్లాదాన్ని పంచే, ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చే ఆ లోకంలోకి వెళదాం రండి.. కాకినాడ జిల్లాలో పర్యటించాలనుకునే వారికి అతి ముఖ్యమైన వాటిలో అన్నవరం ఆలయ సందర్శన ఒకటి. అక్కడ నుంచి ఉప్పాడ సముద్ర తీరం, కాకినాడ బీచ్, కోరంగి మడ అడవులు చూసేశాక.. మధ్య పుదుచ్చేరి రాష్ట్రంలో భాగమైన యానాం బీచ్‌లో అలా విహరించేసి కోనసీమ అందాలను చూసుకుంటూ ఓడలరేవును దాటుకుని దిండి రిసార్ట్స్‌లో బసచేసి, అక్కడి నుంచి అంతర్వేది ఆలయాన్ని, అక్కడి సముద్ర తీరాన్ని చుట్టేసి వస్తే.. కొన్నేళ్ల పాటు ఆ అనుభూతులు మనల్ని వెంటాడతాయని వేరే చెప్పాలా.. ఆ విశేషాలు ఇవిగో...

కోరింగ అభయారణ్యం... మడ అడవులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వన్యప్రాణుల అభయారణ్యం కోరింగ.. భారతదేశంలోని రెండో అతి పెద్ద మడ అడవులు ఇక్కడ ఉన్నాయి. 35 రకాల మడచెట్లు, 120కి పైగా పక్షి జాతులు ఉన్నాయి. నీటి పిల్లి లేదా ఏటి పిల్లి అనే వన్య ప్రాణి ఇక్కడ ప్రత్యేకత. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడ నగరం నుంచి 18 కిలోమీటర్ల దూరంలో కోరింగ ఉంది. తీరం నుంచి కాకినాడను కాపాడే సహజసిద్ధ కోటగా కోరంగిని పిలుస్తారు. కోరంగిలో 300 మీటర్ల పొడవైన చెక్క వంతెనపై నడిచి అభయారణ్యాన్ని వీక్షించడం మధురానుభూతి.



కోరింగ అభయారణ్యంలో చెక్కల వంతెన



మడ అడవుల మధ్య కోరింగ అభయారణ్యం సొగసు చూడతరమా...

వాకలపూడి బీచ్...

కాకినాడ సాగర తీరం ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుంది. నగరానికి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కాకినాడ నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు, జిల్లాలోని ఇతర ప్రాంతాల వాసులు కాకినాడ సాగర తీరానికి వస్తారు. 15 కిలోమీటర్లు పొడవైన ఈ ప్రాంతం తెల్లటి అలలతో అలరిస్తుంది. ఆటపాటలతో సందడి చేస్తారు. వాకలపూడి బీచ్‌లో పర్యాటకులకు అవసరమైన ఎన్నో సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బీచ్ పార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్కు, గోకార్ట్ రేసింగ్, పారాచ్యూట్ వంటి ఎన్నో ఉన్నాయి.



సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ కూడా సందర్శనీయ స్థలం. కాకినాడ సాగర తీరం నుంచి బోటుపై ఆ ప్రాంతానికి చేరుకోవచ్చు. అయితే పోర్టు అధికారులు, మెరైన్ పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి.

భక్తులకు అన్న'వరం'

అన్నవరం కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం. కోరిన కోర్కెలు తీర్చే అన్నవరం సత్యదేవుడు రత్నగిరిపై కొలువై ఉన్నారు. వీరవెంకటసత్యనారాయణ స్వామి ఆలయం అత్యంత విలక్షణమైనది. పురాణాల ప్రకారం ఇక్కడ సత్యదేవునికి ప్రత్యేక వ్రతాలు నిర్వహిస్తుంటారు. వ్రతం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల నమ్మకం. విశాఖ జాతీయ రహదారిలో కాకినాడకు 50 కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది. సందర్శనీయమైన ఎన్నో పురాతన ప్రదేశాలు ఈ ఆలయ ఆవరణలో ఉన్నాయి. పంపా నదిలో విహారం కూడా చేసే అవకాశం ఉంది.





డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం దిండిలో గోదావరి నదిలో బోటుపై విహారం

పర్యాటకులను కట్టిపడేస్తున్న
కోనసీమ అందాలు

దిండిలో నదీపాయలపై అలరిస్తున్న హౌస్‌బోట్లు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు కేరాఫ్ అడ్రస్ కోనసీమ. కేరళ తరహా అందాలను సొంతం చేసుకున్న ఈ ప్రాంతంలో ఏమారుమూల పల్లెకు వెళ్లినా ఆప్యాయతా అనురాగాలతో పల్లకరించే జనం. మర్యాదలతో ముంచెత్తే మనుషులు కనిపిస్తారు. కనువిందు చేసే ఎన్నో సముద్ర, గోదావరి నదీ తీర ప్రాంతాలతో పాటు ప్రకృతి రమణీయతను రంగరించే రీతిలో పచ్చని వేల వెంతన గలగల పారే సెలయేరు కాల్వల మధ్య సాదరంగా స్వాగతం పలికే కొబ్బరిచెట్ల సమూహాలమధ్య పయనించే ఏ పర్యాటకుడైనా ఫిదా కావాల్సిందే.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నదీ తీరప్రాంతాలతో పాటు మడ అడవులు, చమురు క్షేత్రాలు, ప్రసిద్ధి చెందిన ఆలయాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. గలగల పారుతున్న గోదావరిలో పడవ ప్రయాణం పర్యాటకులకు ఓ మధురానుభూతిని మిగులుస్తుంది. వశిష్ఠ నది చెంతన మలికిపురం మండలం దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్‌బోట్లు ద్వారా నదీ విహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతిగదులతో పాటు హౌస్ బోట్లు, వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. గంటల వారీ ప్యాకేజీలు ఇక్కడ అమలు అవుతాయి. వైనతేయ నదీపాయ పేరున హౌస్‌బోటు ప్రత్యేక హంగులతో పర్యాటకులకు నదీ విహారం చేయనుంది. గోదావరి, వశిష్ఠ, ఆత్రేయ పేర్లతో బోట్లు నదీపాయల్లో పర్యాటకులతో విహరిస్తాయి. ముఖ్యంగా హౌస్ బోటులో నలుగురు పెద్దవారు, నలుగురు పిల్లలకు ప్యాకేజీ రూ.15వేలు. గోదావరి బోటులో 20 మంది, వశిష్ఠ బోటులో 20 మంది, ఆత్రేయలో పది మంది పర్యాటకులు ఉంటే నదీ విహారానికి బయల్దేరతాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చు. ఈ బోట్ ప్యాకేజీ కోసం దిండి రిసార్ట్స్‌లోని సెల్ 9848780524 ద్వారా సంప్రదించవచ్చు. ప్రస్తుతం కోనసీమలో దిండి రిసార్ట్స్ వద్ద ఉన్న హౌస్ బోట్ల విహారానికి పర్యాటకులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వీటితో పాటు యానాం నుంచి సావేరీ బోటు ద్వారా సాగర సంగమ విహారం, బోడసకుర్రు, పాశర్లపూడి, ఆదుర్రు, సోంపల్లి, అంతర్వేది, సఖినేటిపల్లి, ఎదుర్లంక, దిండితో పాటు వివిధ నదీ పరివాహక ప్రాంతాల్లో బోటు షికార్లను ప్రైవేటు సంస్థలు ఏర్పాటుచేశాయి. వీటితో పాటు కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహార యాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది.

కోనసీమలోని మలికిపురం మండలం దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడ ఫుడ్ ప్యాకేజీలతో పాటు స్థానికంగా ఈ ప్రాంతంలో లభ్యమయ్యే ఎన్నో రకాల వంటకాలను పర్యాటకులు పసందైన విందుగాస్వీకరిస్తారు. వేసవి సీజను కావడంతో కోనసీమ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి.



ఉప్పాడ తీరం...

పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో ఉన్న ఉప్పాడ తీరం మంచి పర్యాటక ప్రాంతం. ఉవ్వెత్తున ఎగసి పడే అలలు ఇక్కడ ప్రత్యేకం. ఓ పక్క సముద్రతీరానికి సమీపంలోనే నివాస గృహాలతో ఆక్కడంతా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అంతేకాదు.. ఉప్పాడ చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు. ఇక్కడ నేత నేసిన చీరలు దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయి. కాకినాడ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉప్పాడ తీర ప్రాంతం ఉంది. ఎన్నో సినిమాల్లో సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.



యానాం బీచ్

కాకినాడకు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతం యానాం. పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలోని ఈ పట్టణంలో ఓ పక్కన గోదావరి, మరోపక్క సముద్ర తీరం వుంటుంది. పర్యాటకులు సరదాగా గడిపేందుకు అనువైన ప్రాంతం. అంతేకాదు ఇక్కడ మద్యం ధరలు తక్కువ కావడంతో ఎక్కడెక్కడి నుంచో మందుబాబులు వచ్చి ఎంజాయ్ చేస్తారు. ఆంధ్రాకన్నా ఇక్కడ పెట్రోల్ ధరలు కూడా తక్కువే.

శివసదన్ కాటేజీకి రూ.10 లక్షలు విరాళం

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మిస్తున్న శివసదన్ కాటేజీకి మంగళవారం ఏలూరుకు చెందిన బుద్ధిరాజు లలితసుందరి, విశాఖపట్నానికు చెందిన కిండెపూడి వరలక్ష్మి సంయుక్తంగా రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దాతలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు అందజేయగా ఆయన దాతలను అభినందించారు. కార్యక్రమంలో డ్రాఫ్ట్స్‌మెన్ సత్యప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు విరాళం అందజేస్తున్న దాతలు

రెండో రోజుకు ఏపీఈఏపీసెట్

జేఎన్టీయూకే, మే20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు రెండో రోజు కూడా కొనసాగాయి. మంగళవారం నిర్వహించిన అగ్రికల్చర్,ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. రెండు సెషన్లలో మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5వరకు నిర్వహించారు.

● కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో

● ముగిసిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

ఉదయం నిర్వహించిన పరీక్షకు 918 మంది విదార్థులు హాజరుకావాల్సి ఉండగా 856 మంది హాజరుకాగా 62మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 920మంది విదార్థులు హాజరుకావాల్సి ఉండగా 862 మంది హాజరు కాగా 58 మంది పరీక్ష రాయలేదని తెలిపారు.

● తూర్పుగోదావరి జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,285 మంది విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,183 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరు కాగా 92.06 శాతం హాజరు నమోదైందన్నారు.

● అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 798 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 751 మంది హాజరుకాగా 47 మంది రాయలేదని, మొత్తం 94.11 శాతం హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక కీని బుధవారం విడుదల చేస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమై ఈ నెల 27 వరకు కొనసాగుతాయని తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

అనపర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయస్థాయి ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు బుధవారం ప్రారంభంకానున్నాయి. స్థానిక నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళామందిరంలో నాలుగురోజులపాటు జరిగే పోటీలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. 21న జనరల్‌బోగీలు, కిడ్నాప్, 22న(అ)సత్యం, నాన్న నేనొచ్చేస్తా, 23న విడాకులు కావాలి, కొత్త పరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత, 24న చిగురుమేఘం నాటికలను ప్రదర్శిస్తారు.

డాక్టర్ యనమదలకు 'తపన' సేవా పురస్కారం

వచ్చే నెల 22న సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రదానం



కార్పొరేషన్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య విజ్ఞాన రచనల ద్వారా ప్రజారోగ్య రంగంలో విశేష కృషి చేస్తున్న కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు యనమదల మురళీకృష్ణకు సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన తపన సాహిత్య వేదిక సేవా పురస్కారం ప్రకటించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్, ఎయిడ్స్‌పైన, ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న గుండెజబ్బులపైన తన రచనల ద్వారా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణను ఈ ఏడాది సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్టు తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి తెలిపారు. డాక్టర్ మురళీకృష్ణ 2000లో ఎయిడ్స్‌పై, 2022లో కొవిడ్ ఎయిడ్స్ నేను, 2024 మే నెలలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ జూన్ నెలలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్ పుస్తకాలను వెలువరించారు. ఈయన దాదాపు అన్ని ప్రధాన పత్రికలు, సామాజిక, ప్రసార మాధ్యమాల్లో ఆరోగ్య విశేషాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు. కొవిడ్ సమయంలో ఈయన వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రజలకు కొండంత భరోసానిచ్చాయి. రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, గంటేడ గౌరునాయుడు, డాక్టర్ దేవేంద్ర అవార్డుల ఎంపికలో న్యాయనిర్ణేతలుగా వున్నారు. జూన్ 22న హిందూపురంలో అవార్డు ప్రదానం చేస్తామని చిదంబరరెడ్డి చెప్పారు.

పిఠాపురంలో తిరంగా యాత్ర

త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నాం: వర్మ

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంలో త్రివిధ దళాలు చూపిన తెగువ, స్ఫూర్తికి సెల్యూట్ చేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తిరంగా యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా జాతీయ జెండాలతో ప్రదర్శన జరిపి సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కాశీకి 73వేల మట్టి శివలింగాలు

బిక్కవోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): 73వేల మట్టి శివలింగాలు తయారు చేయించి కాశీకి పంపుతున్నట్టు బలభద్రపురానికి చెందిన కొవ్వూరి రామారెడ్డి (హిందీ మాస్టారు) భార్య అచ్చియ్యమ్మ మంగళవారం తెలిపారు. కొంకుదురు శివాలయంలో తయారుచేస్తున్న శివలింగాలను చూసి అక్కడి వారిని సంప్రదించగా తమకు మట్టి పంపారని.. తనతో పాటు వంద మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వీటిని నెలా పదిహేను రోజులు శ్రమించి తయారు చేశామని చెప్పారు.



బలభద్రపురంలో తయారు చేసిన మట్టి శివలింగాలు



కాకినాడ కలెక్టరేట్ ఎదుట వంట-వార్పు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీహెచ్‌వోల వంట-వార్పు

● కాకినాడ కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన

కలెక్టరేట్ (కాకినాడ)మే 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. వంట-వార్పు ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్యమిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతనాలు వర్తింపజేయాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట జాబ్‌చార్టర్ ఇవ్వాలని, ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, జీతాల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని నినదించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రఘు, వరకాంత్, నానాజీ, అనిల్, ప్రసన్న పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తోనే..

మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తన తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తో ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్ తెలిపారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు వచ్చిన ఆయన విలేకర్లతో ముచ్చటించారు. ఈ మధ్య సినిమాలకు గ్యాప్ ఎక్కువ వచ్చిందని అడగ్గా నవ్వి ఊరుకున్నారు. పుష్ప-2 చిత్రం ద్వారా జాతీయ స్థాయిలో తనకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సినిమాలను థియేటర్లలో, టీవీల్లో వీక్షిస్తున్నారని, పట్టణాల్లో యాప్‌లతో మమేకమవుతున్నారని తెలిపారు. తాను మొదటిగా పేపర్ చూసేటప్పుడు స్పోర్ట్స్, సినిమాలు, తరువాత రాజకీయాలు చదువుతానన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సుకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.కాసేపు మాట్లాడారు.

ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్





మలికిపురం మండలం మట్టపర్రులో ఓ బాలుడికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న సుకుమార్

సిద్ధివినాయకుని హుండీల ఆదాయం రూ.27.68 లక్షలు



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. 61 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.26,86,790, అన్నప్రసాదం ద్వారా రూ.81,491 వెరసి మొత్తం రూ.27,68, 281 నగదుతో పాటు 4.4 గ్రాముల బంగారం, 436 గ్రాముల వెండి, 30 విదేశీ కరెన్సీ నోట్లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పర్యవేక్షణాధికారి జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకస్వాములు, గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోకోనట్ పార్కు, సీపీసీఎస్‌ల ఏర్పాటుపై అధ్యయనం

ఐదుగురు సభ్యులతో అధికారుల బృందం

కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో పర్యటన



మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ డైరెక్టర్ శ్రీదేవి అన్నపూర్ణను కలిసిన కోనసీమ జిల్లా అధికారుల బృందం

అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోకోనట్ కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీపీసీఎస్) ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేపట్టింది. దీనిలో భాగంగా సాంకేతిక సరఫరా, వీటి స్థాపనకు అవసరమైన స్థలాలు మార్కెటింగ్ లింకేజెస్ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం ఇతర రాష్ట్రాలకు వెళ్లింది. ఐదు రోజుల పాటు ఈ బృందం మైసూర్, కాసర్గోడ్, కొచ్చిన్, కోయంబత్తూర్‌లో పర్యటించనుంది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనలతో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పీడీడీఆర్డీఏ జైచంద్ర గాంధీ, జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, ఏపీ ఐఎస్‌సీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎల్డీఎం వర్మ తదితరులు ఉన్నారు. దీనిలో భాగంగా మైసూర్‌లోని కేంద్రీయ ఆహార పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్‌ఐ)ను సందర్శించారు. డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవిఅన్నపూర్ణతో పాటు ఇతర శాస్త్రవేత్తలతో సమావేశమై కొబ్బరి, అరటి వంటి తోట పంటల విలువ జోడింపు, ఉత్పత్తులపై పరిశోధన, ప్యాకేజింగ్, ఎగుమతులు వంటి అంశాలపై చర్చించారు. మంగళవారం కాసర్గోడ్‌లోని కేంద్రీయ తోట పంటల పరిశోధనాసంస్థ (సీపీటీఆర్‌ఐ)ను సందర్శించిన బృందం శాస్త్రవేత్తలతో మాట్లాడారు. రోగనిరోధకత కలిగిన కొబ్బరి రకాలు, కోనసీమ వాతావరణానికి అనుకూల వంగడాలపై అక్కడ శాస్త్రవేత్తలతో సమగ్రంగా చర్చించారు. ఈ నెల 21న కొచ్చిన్‌లోని కొబ్బరి అభివృద్ధి బోర్డు (కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు)ను సందర్శించనున్నారు. కొబ్బరి ఫైబర్ ప్రోసెసింగ్, కొబ్బరి ఉత్పత్తిని బ్రాండెడ్ ఉత్పత్తిగా తయారుచేయడం, క్వాయర్ పరిశ్రమలకు అవసరమైన యంత్ర పరికరాలను సేకరించనున్నారు. 22న కొచ్చిన చుట్టుపక్కల పరిసరాల్లో పర్యటిస్తారు. 23న తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రైవేటు కొబ్బరి పరిశ్రమల స్థాపన, వాటి నిర్వహణ, మార్కెటింగ్ అంశాల వంటి వాటిపై చర్చించనున్నారు. పర్యటన అనంతరం అధికారుల బృందం కలెక్టర్‌కు కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు, ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అధ్యయన నివేదికను సమర్పించనున్నారు.

సామర్లకోట-కాకినాడ రోడ్డులో వాహనాల రాకపోకలు యథాతథం

కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపే కార్యక్రమాలను వర్షాల వల్ల తాత్కాలికంగా వాయిదా వేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామర్లకోట నుంచి కాకినాడ మార్గంలో ముత్యాలమ్మ గుడి వద్ద ఓవర్ బ్రిడ్జి గడ్డర్ల పనుల నిమిత్తం నాలుగు రోజులు ట్రాఫిక్ మళ్లించాలని తొలుత నిర్ణయించామని, వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. దీంతో సామర్లకోట- కాకినాడ కెనాల్ రోడ్డులో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగుతాయని, ఈ మార్పును వాహనచోదకులు గమనించాలని కోరారు.

మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన చైతన్య జనార్దన

కొత్తపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలానికి చెందిన ఓడా చైతన్యజనార్దన (36) రావులపాలెంలో పని నిమిత్తం సోమవారం కొత్తపేట నుంచి రాత్రి 11 సమయంలో మోటార్‌సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. 1.45 సమయంలో కొత్తపేట తిరిగి వస్తుండగా మందపల్లి బ్రిడ్జి దాటిన తరువాత కల్యాణి సోంపాపిడి స్వీట్స్ షాపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా రావులపాలెం వెళ్తున్న మోటార్‌సైకిల్ ఎదురుగా ఢీకొనడంతో చైతన్యజనార్దన తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై అతడి భార్య ఓడా చిన్నారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మరో మోటార్‌సైకిలిస్టుకు కూడా తీవ్రగాయాలు కాగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24 గంటల్లో దొంగను పట్టేశారు

రూ.10 లక్షలు చోరీ

అన్నవరంలో నిందితుడి అరెస్ట్



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూరిఅప్పారావు

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): రూ.10 లక్షల చోరీ కేసులో నిందితుడిని 24 గంటల్లో పట్టుకుని బాధితుడికి నగదును అందజేశారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన బోడపాటి నాగేశ్వరరావు సోమవారం కాకినాడ జిల్లా తునిలో ఉన్న తన స్థలం విక్రయించి అడ్వాన్స్ రూపంలో రూ.10 లక్షలు నగదు, మరో రూ.10 లక్షలు చెక్ ద్వారా తీసుకున్నాడు. నగదును బ్యాగ్‌లో పెట్టుకుని తుని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కి అన్నవరంలో దిగాడు. అయితే అతని దృష్టిమరల్చి బ్యాగ్ కత్తిరించి నగదుతో నిందితుడు ఉడాయించాడు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన నాగేశ్వరరావు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పెద్దాపురం డీఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావులు నాలుగు టీంలుగా విభజించి దర్యాప్తు చేపట్టగా అన్నవరం జాతీయ రహదారిపై మండపం సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న విశాఖపట్నానికి చెందిన కంబాల శ్రీనును అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నగదు తస్కరించుకున్నట్టు అంగీకరించడంతో అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దొంతనం కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పెద్దాపురం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ఏఎస్‌ఐ బలరాం, హెచ్‌సీ రాధాకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతివ్వాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు అనుమతివ్వకపోతే క్రైస్తవ సంఘాలు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ. హర్షకుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 24న కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే సభ అనుమతికి కోరగా పోలీసులు మాత్రం స్పందించలేదన్నారు. సంస్మరణ సభకు అనుమతిస్తే ఎవరి మనోభావాలకు భంగం కలగకుండా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండ సభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సముద్రంలో వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

సురక్షితంగా బయటపడ్డ మరో ఇద్దరు



గల్లంతైన శ్యామ్ (ఫైల్‌ఫొటో)

కొత్తపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేట నిషేధం అమలులో ఉన్నా ముగ్గురు యువకులు బోటులో వేటకు బయలుదేరారు. వాతావరణం బాగోకపోవడంతో కెరటాలు ఉధృతంగా ఉండటంతో వారి బోటు కెరటాల ధాటికి తిరగబడింది. దీంతో ఒకరు గల్లంతవ్వగా ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్‌కాలనీకి చెందిన మత్స్యకార యువకులు మేరుగు శ్యామ్(19), వంకా ఇస్సాక్, ధామిశెట్టి వీరబాబు సోమవారం అర్ధరాత్రి కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మత్స్యకారుడి బోటుపై చేపల వేటకు వెళ్లారు. డీప్ వాటర్‌పోర్టు, హోప్ ఐలాండ్ మధ్య చేపలు వేటాడే క్రమంలో కెరటాల ఉధృతికి బోటు తల్లకిందులవడంతో ముగ్గురు సముద్రంలో మునిగిపోయారు. ఇస్సాక్, వీరబాబు ఈదుకుంటూ దగ్గర్లో హోప్ ఐలాండ్‌కు సురక్షితంగా చేరుకున్నారు. శ్యామ్‌కు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడని సహచర మత్స్యకారులు సమాచారమిచ్చారు. దీంతో మంగళవారం ఉదయం 6బోట్లపై మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా శ్యామ్ జాడ తెలియలేదని రామకృష్ణ తెలిపారు.

ఉగ్రవాద కదలికలపై ఉలిక్కిపడ్డ రంప మన్యం

రంప అడవుల్లో బాంబులు

పేల్చడంపై సర్వత్రా ఆందోళన

ఎన్ఐఏ విచారణలో అంశాలపై

విస్తుబోతున్న పోలీసువర్గాలు

రంపచోడవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడులకు రిహార్సిల్స్‌గా రంప అడవులను ఎంచుకుని బాంబు పేలుళ్లను నిర్వహించిన అంశం రంప మన్యాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇంతకాలం రంప అడవులు కేవలం మావోయిస్టు కార్యకలాపాలకే పరిమితమనుకుంటే ఇప్పుడు ఉగ్ర కార్యకలాపాల అమలు పరీక్షలకు కూడా ఏజెన్సీని వేదికగా చేసుకోవడం పోలీసువర్గాలను విస్తుబోయేలా చేస్తోంది. పాక్ ఉగ్రవాద వర్గాలకు సానుభూతిపరులుగా ఉన్న విజయనగరానికి చెందిన సిరాజ్ రెహ్మన్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు ఉగ్రవాద చర్యలకు సహకరిస్తూ అందుకు కావాల్సిన పేలుడు పదార్థాలను సేకరించి వాటిని పరీక్షించేందుకు రంప అడవులను ఎంచుకున్నారని ఎన్ఐఏ వర్గాలు గుర్తించాయి. దీంతో అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే వారు రంప అడవులను తమ పేలుళ్ల రిహార్సిల్స్ కోసం ఎంచుకోవడాన్ని గ్రహించారు. వీరు ఇక్కడకు ఎలా రాగలిగారు, ఇక్కడ ఎన్ని రోజులున్నారు, ఎక్కడెక్కడ తిరిగారు అన్న అనేక అంశాలను లోతుగా విచారించే దిశగా ఎన్ఐఏ బృందాలు పనిచేస్తున్నట్టు సమాచారం.

తల్లితో వివాహేతర సంబంధం.. కూతూరితో పెళ్లి చేయాలని బెదిరింపు

● యువతిపై దాడి ● నిందితుడిపై కేసు



నిందితుడు నాగిరెడ్డి

అనపర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె కుమార్తెపై కన్నేసి చంపుతానని బెదిరించాడో వ్యక్తి. అనపర్తి ఎస్‌ఐ శ్రీను నాయక్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళకు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. 2016లో మహిళ భర్త చనిపోయాడు. భర్త చనిపోయిన 8 నెలలకు గ్రామానికి చెందిన పడాల నాగలక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ నాగిరెడ్డి పరిచయమయ్యాడు. అది కాస్తా సహజీవనంగా మారింది. ఆ మహిళ పెద్ద కుమార్తె పదో తరగతి చదివే సమయంలో తనకిచ్చి పెళ్లి చేయాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో తల్లీ కూతుళ్లు నాగిరెడ్డిని ఇంటికి రాకుండా కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఇటీవల విడిపోయారు. అనంతరం తిరిగి పాత మహిళ వద్దకు చేరుకున్న నాగిరెడ్డి బీటెక్ చదువుతున్న పెద్ద కుమార్తెపై కన్నేశాడు. ఈ క్రమంలో గత నెల 30న రాత్రి వారి ఇంటికి వెళ్లి వివాహ విషయంపై గొడవ పెట్టుకుని తల్లి కుమార్తెను చిత్రహింసలకు గురిచేశాడు. యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పెళ్లి చేయకపోతే ముగ్గురిని చంపుతానని బెదిరించడంతో తట్టు కోలేకపోయిన బాధిత మహిళ 3రోజుల కిందట అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరు కుటుంబాలను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పడంతో వారు వచ్చారు. నాగిరెడ్డి తల్లి భానుమతి యువతిపై విరుచుకుపడి ఆమె పీక పట్టుకుని కింద పడేసి దాడికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న యువతిని ఏరియా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అందించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. తల్లీ కుమార్తెల ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలిక ఫిర్యాదుతో నలుగురిపై పోక్సో కేసు

మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తనను మోసం చేశాడని యువకుడిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పీవీవీ.సురేష్ తెలిపారు. మలికిపురం మండలంలో బంధువుల ఇంటికి వచ్చిన ఏలూరుకు చెందిన ఎం.రాకేష్, 2023లో బాలికతో ప్రేమ వ్యవహారం నడిపి హైదరాబాద్‌కు వెళ్లి సహజీవనం చేశారు. వీరి మధ్య విబేధాలు రావడంతో పెద్ద మధ్య రాజీ ప్రయత్నం కుదరలేదు. దీంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద యువకుడితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సెర్ప్ సీసీ సూర్యనారాయణకు షోకాజ్ నోటీసులు

నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు

మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కాకినాడ జిల్లా పిఠాపురం మండలం సెర్ప్ సీసీ కమ్ ఆఫీస్ అసిస్టెంట్ జి.సూర్యనారాయణకు డీఆర్డీఏ-సెర్ప్ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో సీసీగా పనిచేసిన సమయంలో ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు, మహిళలను లైంగికంగా వేధించినట్టు సూర్యనారాయణపై ఆరోపణలొచ్చాయి. దీనిపై కొత్తపల్లి-2 వీవోఏ కె.గాయత్రి ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎంఎం జిలానీ విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా 2023 నవంబరు 1న మంజూరైన స్త్రీ నిధిలోను రూ.3.50 లక్షలను, కొత్తపల్లి క్లస్టర్ సీసీ, ఆఫీసు అసిస్టెంట్‌గా పని చేసిన సమయంలో సూర్యనారాయణ ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం చేసినట్టు, 2023 మార్చి 24న మంజూరైన స్త్రీ నిధి రుణంలో ఒక సభ్యురాలికి రూ.75వేలకు కేవలం రూ.50వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని తీసుకున్నట్టు, హెచ్ఆర్ నిబంధనలకు విరుద్ధంగా మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్టు విచారణ అధికారి తన నివేదికలో వివరించారు. వీటి ఆధారంగా క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సీసీ సూర్యనారాయణను డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశించారు. లేకుంటే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

వాన మయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎండలకు అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. కొన్నిచోట్ల వర్షానికి దారులు చెరువుల్లా మారాయి.



కాకినాడలో వర్షానికి చెరువును తలపిస్తున్న ఓ రహదారి



కాకినాడ నూకాలమ్మ గుడి రోడ్డులో వర్షం నీటిలో వెళ్తున్న వాహనాలు



భారీ వర్షానికి కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులో చెరువులా మారిన ప్రధాన రహదారి

రాజమహేంద్రవరంలో వర్షానికి తడవకుండా వాహనదారుల జాగ్రత్తలు





కోనసీమ జిల్లా మండపేటలో రహదారిపై వర్షం

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో గుంతలు పూడ్చివేత

సామర్లకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో రైల్వే గేటు ఎదురుగా ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు ప్రమాదభరితంగా మారాయి. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు చొరవతో ఆ విభాగం పోలీసులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. పలువురు వాహన చోదకులు ఎస్ఐను అభినందించారు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



గొల్లప్రోలు పట్టణ శివారులోని గండేవారి కాలువపై ఏర్పాటు చేసిన తాటిబద్దలపై నడుచుకుంటూ పొలాలకు వెళ్తున్న రైతులు

తాటిబద్దలే ఆధారం!

పొలాలకు చేరడానికి నిత్యం ప్రమాదపుటంచున ప్రయాణం

గొల్లప్రోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు వారి పొలాలు చేరుకోవాలంటే కాలువపై తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న తాటిబద్దలు దాటి వెళ్లాల్సిందే. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని గండేవారి కాలువ దాటిన తర్వాత సుమారు వేయి ఎకరాలకు పైగా పంట పొలాలు ఉన్నాయి. వీటికి వెళ్లేందుకు సరైన దారి లేదు. కాలువపై వంతెన లేకపోవడంతో రైతులు తాత్కాలికంగా తాటిబద్దలు ఏర్పాటు చేసుకుని దానిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అధిక వర్షాలు, వరదల సమయాల్లో కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉంటోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడే అవకాశముంది. పలువురు రైతులు తాటిబద్దలపై నుంచి కాలువ దాటుతూ అందులో పడిపోవడం, సమీప పొలాల్లోని రైతులు వారిని గమనించి కాపాడడం నిత్యకృత్యంగా మారింది. గండేవారి కాలువపై పూర్తిస్థాయి వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఇరిగేషన్ అధికారులు స్పందించట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని రైతులు రాకపోకలు సాగించేందుకు వీలుగా వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.



మృతుడి కుమారుడికి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల మానవత్వం

చనిపోయిన మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

కరప, మే 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చనిపోయిన మిత్రుడి కుటుంబానికి సహచర మిత్రులు రూ.లక్ష సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. కరప గ్రామానికి చెందిన నడిపిల్లి వీరవెంకటసత్యనారాయణ ప్రింటింగ్ ప్రెస్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుమారు 15ఏళ్ల క్రితం అతడి రెండు కిడ్నీలు పాడైపోవడంతో తల్లి తన కిడ్నీ ఇచ్చి కుమారుడిని బతికించుకుంది. దీనిపై అప్పట్లో ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం రావడంతో దాతలు ముందుకొచ్చి అతడి ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సాయం అందజేశారు. అమర్చిన కిడ్నీ దెబ్బతిని ఇటీవల మరణించాడు. మిత్రుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని పదో తరగతి 1990-91 బ్యాచ్ విద్యార్థులు నిర్ణయించారు. తలో చేయి వేసి రూ.1.03 లక్షలు సేకరించి మంగళవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. పూర్వ విద్యార్థులు పెద్దిరెడ్డి శ్రీరామకృష్ణ, కూనపురెడ్డి వీర్రాజు, పెంకే సత్తిబాబు, దేవు వెంకన్న, ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, అడపా కృష్ణవేణి, అనంతలక్ష్మి, నాగలక్ష్మి, సూర్యకళ, ఎంఎల్ రాణి, కుసుమ, బాను భాగ్యలక్ష్మి, సాయిలక్ష్మి, వీరవేణి, జయలక్ష్మి, పలివెల శ్రీధర్ పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

సర్పవరం జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఇంగ్లిష్ మీడియం స్కూలు ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి ఈ నెల 18 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ ఎం.నాగేంద్రరావు-సుజాత దంపతులు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. గ్లాస్ పెయింటింగ్, క్లే మోడలింగ్, ఒరిగామి ఆర్ట్‌లో రాణించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి-సత్యనారాయణమూర్తి దంపతులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సర్పవరం జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తూరంగి, నైగోలుపాడు, ఇంద్రపాలెం, వాకలపూడి, కరప మండలం అరట్లకట్ట, వేళంగి, పెనుగుదురు గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,80,349 లక్షలు మంజూరయ్యాయి. వాటిని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మంగళవారం అందజేశారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి పాల్గొన్నారు.

లోకేశ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలి

పిఠాపురం నియోజకవర్గ మినీ మహానాడులో మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి నారా లోకేశ్‌కు భవిష్యత్తులో సారథ్య బాధ్యతలు అప్పగించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని మునిసిపల్ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ.. లోకేశ్ నాయకత్వ పటిమను గుర్తించి రెండు గంటలు ప్రత్యేకంగా సమావేశమయ్యారని గుర్తు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరాగా పరిసర ప్రాంతాలన్నీ పసుపుమయంగా మారాయి. పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పోలువర్తి గణేష్‌కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, నాయకులు వానురెడ్డి ఏసుదాసు, తోట నవీన్, నియోజకవర్గ సమన్వయకమిటీ సభ్యులు, పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు. పొత్తు ధర్మంలో భాగంగా సీటు త్యాగం చేసిన సమయంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు ఇచ్చిన మాటకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తెచ్చినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పెండింగ్ హౌసింగ్ బిల్లులు చెల్లించాలని, లే-ఔట్లలో అక్రమాలను గుర్తించి ఖాళీగా ఉన్న స్థలాలను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని, వెలుగు పథకంలో జరిగిన రూ.14కోట్ల అవినీతి, ఇళ్ల స్థలాల చదును, భూముల కొనుగోలు వ్యవహారంపై విచారణ జరిపించాలని తీర్మానించారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్

నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్

జీజీహెచ్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జీజీహెచ్ ప్రాంగణంలో శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నగర సహ కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ విజయకుమార్, జె.శేషు, ఎస్.వాసు, డి.దుర్గాప్రసాద్, రాయుడు రమేష్, రవి, జనార్దన్, భాగ్యవతి, మెస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అనపర్తి ఏడుకొండలు, సెక్యూరిటీ యూనియన్ నాయకులు సోమరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కార్మికుల మెడలకు ఉరితాడు బిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకోవడం కోసం జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్నేహలత, సావిత్రి, రత్నం, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, లోవకుమారి, సత్య, కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, ఎన్.సూరిబాబు, శ్రీనివాసు, కృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తాళ్లరేవు తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రభుత్వ స్కీము వర్కర్లు, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నేత టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్కీము వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం తహసీల్దారు పి.త్రినాథరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. రాయుడు నాగలక్ష్మి, పెయ్యల అనంతలక్ష్మి, లంక విమలాదేవి, విజయలక్ష్మి, గనికమ్మ, కళావతి, పుష్పావతి, శారదాదేవి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

భారీ వర్షం... స్తంభించిన జనజీవనం

కరప, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలవ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు, గ్రామాల్లోని వీధుల్లో వర్షం నీరు నిలిచిపోయింది. కరప ఎంపీడీవో కార్యాలయంతో పాటు బీసీ గురుకుల పాఠశాల, హైస్కూల్ క్రీడా ప్రాంగణాలు ముంపునకు గురయ్యాయి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని కరప-అరట్లకట్ట రోడ్డులో పలుచోట్ల వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించడానికి జనం ఇబ్బందిపడ్డారు. వలసపాకల ప్రాథమిక పాఠశాల, గొర్రిపూడి ఎస్సీపేట, గురజనాపల్లి తుపాన్ షెల్టర్ భవనం చుట్టూ భారీగా నీరుచేరింది. చేలల్లో కోయకుండా వదిలేసిన వరి పంట దెబ్బతింది. పలుచోట్ల ధాన్యం రాశులు తడిసిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒడ్డుకు చేర్చి బరకాలు కప్పిన ధాన్యం కూడా తడిసిందని పలువురు తెలిపారు. వలసపాకల లే-ఔట్‌లోని బరకాలు కప్పిన ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరింది. ఆయా గ్రామాల్లో తడిచిన ధాన్యం రాశులను రైతులు ఒబ్బిడి చేసుకుని ముంపునీటిని తరలించే ప్రయత్నాలు చేశారు. నిర్విరామంగా కురిసిన వర్షంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి తెరిపివ్వడంతో బయటకు వచ్చి పనులు చక్కబెట్టుకున్నారు.



కరప మండలంలో ముంపునకు గురైన కరప-అరట్లకట్ట రోడ్డు

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన శక్తి తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం కాస్త తెరిపివ్వడంతో బయటకెళ్లి నిత్యావసరాలు తెచ్చుకున్నారు. ఉప్పాడ తీర ప్రాంతంలోని గ్రామాలను కెరటాలు ప్రస్తుతం సాధారణ స్థాయిని మించి తాకుతున్నాయి. వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు ఇళ్ల వద్దే వున్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు నిలిచిపోయింది. వర్షం తెరిపి ఇవ్వకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. వాతావరణం పూర్తిగా చల్లబడింది. మధ్యాహ్నం 2గంటల తర్వాత ఎండకాయడంతో పాటు ఉక్కపోత వాతావరణం నెలకొంది. పిఠాపురం-సామర్లకోట రోడ్డులో ఆరబోసిన ధాన్యం రాశులు నీట తడిసాయి.

అపరాల పంటకు నష్టం

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): విస్తారంగా పడుతున్న వర్షాలతో దాళ్వా అనంతరం సాగు చేసిన అపరాల పంటకు నష్టం వాటిల్లింది. గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో దాళ్వా వరి సాగు చేసిన రైతులు మినుము, పెసర వేశారు. ప్రస్తుతం ఇవి పూత దశకు చేరుకుంటున్న తరుణంలో వర్షం పడడంతో కాపు కాసే అవకాశాలు తగ్గిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయగూరల పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఎనిమిది గంటల పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.

గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు నాటు వైద్యులను, ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా కేవలం అర్హులైన వైద్యులను మాత్రమే సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. ముఖ్యంగా ఆర్ఎంపీలు గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు రిఫర్ చేయకూడదన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందితే మాతృ, శిశు మరణాలను నియంత్రించవచ్చన్నారు. 9 నెలల నిండు గర్భిణి సమయంలో కనీసం రెండుసార్లు స్కానింగ్ తప్పనిసరి అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, కాకినాడ జీజీహెచ్‌లో ఉచితంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తారన్నారు. ఎవరైనా నాటు వైద్యులు, ఆర్ఎంపీలు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లకు రిఫర్ చేస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ సెక్షన్ 22 ప్రకారం ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు చేసినా శిక్షార్హులు అవుతారన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, అంతే కాకుండా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

'తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు జీతాల బకాయిలు చెల్లించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లగా పనిచేస్తున్న కార్మికులకు జీతాల బకాయిలను తక్షణం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. తొలుత డ్రైవర్లు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, సహ కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవర్లు ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం జీతాలు చెల్లించట్లేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు ఇచ్చే వేతనం రూ.7,800 కూడా సకాలంలో ఇవ్వట్లేదని విమర్శించారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సాయికుమార్, మల్లికార్జున, చిన్నబాబు, కుమార్, సుభాష్, రమణ, విజయ్, శంకర్, నరేష్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'తుఫాన్లను సమర్థవంతంగా ఎదుర్కొందాం'

కొత్తపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏర్పడే తుపాన్‌లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి తహసీల్దారు జి.చిన్నారావు కోరారు. మంగళవాం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి దేవుల నాయక్ అధ్యక్షతన సైక్లోన్ ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సమీక్షించారు. తుపాన్ సమయాల్లో తీర ప్రాంత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడి సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో ముందుగా ఆయా ప్రాంతాల్లో జనరేటర్లు ఏర్పాటుచేసుకోవాలన్నారు. తీర ప్రాంత గ్రామాలకు చెందిన అధికారులు ఎప్పటి సమాచారం అప్పుడు సేకరించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో పి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, ఏఎస్‌వో బండి అప్పలరాజు, మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న తహసీల్దారు చిన్నారావు

నేడు మినీ మహానాడు

సర్పవరం జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ మినీ మహానాడును బుధవారం సర్పవరం జంక్షన్‌లోని స్పందన ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) పేర్కొన్నారు. మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరవుతారన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వపరంగా విధి విధానాలపై పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, సలహాలు తీసుకుని ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే టీడీపీ మహానాడులో అధిష్ఠానానికి పంపిస్తామని చెప్పారు.

'సుబ్రహ్మణ్యం కుటుంబానికి నేటికీ అందని రాయితీలు'

కాకినాడ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకు గురై మూడేళ్లు పూర్తయినా ప్రభుత్వపరంగా ఆ కుటుంబానికి ఇప్పటి వరకు ఎటువంటి రాయితీలు అందలేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణలను చిన్న కుమారుడు నవీన్ కుమార్ కూలి పనికి వెళ్తూ పోషిస్తున్నాడన్నారు. నవీన్‌కుమార్‌కు ఏదో ఒక ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని ఇచ్చిన హామీని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధిత కుటుంబానికి చట్టపరంగా అందించాల్సిన భూమి, ఇల్లు, ఉపాధి, సాయం సత్వరం అందేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వరప్రసాద్ కోరారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

సామర్లకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల, పట్టణ పరిధిలో ఇళ్ల స్థలాలకు అర్హులైన పేదలందరూ బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



మోటారు సైకిళ్లపై బయల్దేరిన టీడీపీ నేతలు

ముమ్మిడివరం తరలిన టీడీపీ నేతలు

తాళ్లరేవు, మే 20 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడుకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సీనియర్ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు పిల్లి సత్తిబాబు, జక్కల ప్రసాద్, గంజా సూరిబాబు, మందాల సత్తిబాబు, కార్యకర్తలు పసుపు చొక్కాలు ధరించి పసుపు జెండాలు చేతబూని ర్యాలీగా తరలివెళ్లారు.

సమ్మె నోటీసు ఇచ్చిన అంగన్వాడీలు

సామర్లకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సిబ్బంది తమ సమస్యల సాధనకై జూలై 9 నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసులను అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ సామర్లకోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు మంగళవారం తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్‌ని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ల్యాప్‌టాప్ గల్లంతుపై ఫిర్యాదు

సామర్లకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కాకినాడ వస్తున్న శేషాద్రి రైలులో తన ల్యాప్‌టాప్, ఇతర సామగ్రి గల్లంతైందని కాకినాడకు చెందిన సమయమంతుల సూర్యపవన్ మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి దాటాక విజయవాడలో శేషాద్రి రైలు ఎక్కి బెర్తులోనే నిద్రించానన్నాడు. ఉదయం రైలు సామర్లకోటకు చేరుకునే సమయంలో తాను నిద్రలేచి ల్యాప్‌టాప్ బ్యాగ్ కోసం వెదికినప్పటికీ కనిపించలేదన్నాడు. ల్యాప్‌టాప్ తాను పనిచేస్తున్న సామ్‌సంగ్ కంపెనీది కాగా తాను పనిచేస్తున్న ఆల్ ఈవెంట్స్ సంస్థకు చెందినదన్నారు. బోగీలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సూర్యపవన్ చెప్పాడు.

ఘర్షణలో 11 మందిపై కేసు నమోదు

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌లో జరిగిన ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి 11 మందిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘర్షణలో ఆరుగురికి గాయాలైన సంగతి తెలిసిందే. కుంచే మరియమ్మ ఫిర్యాదు మేరకు 8మందిపై, కొల్లు లక్ష్మి ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

నేడు ఎమ్మెల్యే దివ్య ప్రజాదర్బార్

కోటనందూరు, మే 20 (ఆంధ్ర జ్యోతి):నేడు కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెంలో రామాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎండీవో పి.వెంకి నాయుడు తెలిపారు. ఈ ప్రజాదర్బార్ తుని ఎమ్మెల్యే యన మల దివ్య హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం పదిగంటలకు ప్రజాదర్బార్ ప్రారంభమవుతుందన్నారు. ప్రజల సమస్యలను ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ప్రజాదర్బార్‌కు మండల అధికారులంతా హాజ రుకావాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కూటూరు పంచాయతీ కార్యదర్శికి మెమో

కూనవరం, మే20 (ఆంధ్రజ్యోతి): కూటూరు పంచాయతీ కార్యదర్శి తరచూ విధులకు గైర్హాజరవుతుండడంతో ఆమెకు ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్ మెమో జారీచేశారు. ఈమె విధులకు డుమ్మా కొడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో కొండరెడ్లు ఉండటంతో వారు కార్యాలయానికి వచ్చినప్పుడు కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. దీంతో స్థానికులు ఆమెపై ఫిర్యాదు చేయడంతో మెమో జారీ చేసి వివరణ కోరినట్టు ఎంపీడీవో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విధులకు వెలుగు ఏపీఎం డుమ్మా

• ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం : ఎంపీడీవో



కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

కూనవరం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వెలుగు ఏపీఎం విధులకు తరచూ గైర్హాజరవుతున్నాడు. కోతులగుట్ట వెలుగు కార్యాలయంలో శ్యామ్‌బాబు ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. వారానికి రెండురోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చి రిజిస్టర్లో సంతకాలు చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విధులకు గైర్హాజరవుతున్నట్టు తనకు కూడా ఫిర్యాదు వచ్చినట్టు తెలిపారు. కనీసం సర్వసభ్య సమావేశానికి కూడా హాజరుకావడం లేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలి

• చింతూరులో ఆరో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్ష చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): చింతూరులో రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలను ఎర్రంపేట పేసా కమిటీ ఉపాధ్యక్షుడు కారం సాయి బాబు ప్రారంభించి మాట్లాడుతూ జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని కోరారు. జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా ఆదివా సులను మోసం చేస్తూనే ఉంటుందని, ఆదివాసీ మేలుకో నీ హక్కులను కాపాడుకో అనే నినాదంతో పాటు దీక్షల నుంచి ఆదివాసీ యువతరం ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆదివాసీ ఎమ్మెల్యేలతో గిరిజన సలహామండలిని ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలని, జేఏసీ నాయకులు పూర్తి ఆదేశాలు వచ్చే వరకు తాము ఈ దీక్ష విరమించబోమని చెప్పారు. కార్యక్రమంలో కూర మహేంద్ర, పాయం అది, మడివి దేశమ్మ, మడివి మీనాక్షి, మడివి. సాయి బొడ్డు బలరాం, కంగాల ప్రవీణ్, జల్లి భిక్షం, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

నేడు గండిపోశమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

దేవీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): గొందూరు మాతృశ్రీ గండిపోశమ్మ దేవాలయం వద్ద గోదావరి పెరగడం, ఏజెన్సీ ప్రాంతంలో వివిధ దేవాలయల్లో దొంగతనాలు జరుగుతున్న కారణంగా పోలీస్ శాఖ సూచనలతో ఈనెల 21న ఉదయం 8 గంటలకు అమ్మవారి హుండీలను దేవదాయ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్థుల సమక్షంలో లెక్కిస్తామని కార్యనిర్వహణాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా గంగాలమ్మ జాతర ప్రారంభం




కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

మారేడుమిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే మారేడుమిల్లి గ్రామదేవత మాతృశ్రీ కనకవర్షిణి గంగాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ఘనంగా చేశారు. గ్రామమంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట బంధువుల హడావిడి కనిపించింది. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద గరగల నృత్యాలు, డప్పులతో జాతర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు ఆరురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.

4500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం..

ఎటపాక, మే 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని గుండువారిగూడెం, పిచుకల పాడు గ్రామాల్లో మంగళవారం రెండు ఉభయ రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఎక్సైజ్, పోలీసు, టాస్క్‌ఫోర్స్ వారి నేతృత్వంలో సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వ హించారు. 4500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారాతో పాటు సారాలో వినియోగించే 20 కిలోల పటికను సీజ్ చేశారు. 48 బెల్లం ఊట డ్రమ్ములను ధ్వంసం చేశారు. గుండువారిగూడెంలో ఐదుగురు నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్టు రంపచోడవరం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగరాహుల్ తెలిపారు. తెలంగాణలోని కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్ కరంచంద్, చింతూరు ఎక్సైజ్ సీఐ ఇంద్రజిత్, ఎటపాక సీఐ కన్నపరాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మినీ మహానాడులో పోలవరం నిర్వాసిత సమస్యలు



మినీ మహానాడులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దేవీపట్నం, మే 20 (ఆంధ్ర జ్యోతి): మంగళవారం నందుమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మినీ మహానాడులో దేవీపట్నం టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరరావు నిర్వాసితుల సమస్యలను మహానాడు దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలో సుమారు 44 గ్రామాలు పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యాయని, గతంలో కొన్ని గ్రామాలకు పునరావాస కాలనీలను మన ప్రభుత్వంలోనే నిర్మించారని, గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోలేదన్నారు. కొన్ని గ్రామాలకు ఇంకా పునరావాస కాలనీలు ఏర్పాటు చేయలేదని, అన్ని అర్హతలున్న కొంతమంది నిర్వాసితులను అర్హులుగా గుర్తించలేదని, భూమికి నష్టపరిహారం గిరిజన గిరిజనేతర రైతులకు చాలామందికి ఇవ్వాలని, ఈ సమస్యలన్నీ తీర్మానం చేసి కడపలో జరిగే మహానాడులో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టిలో పెట్టాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ల దృష్టి తీసుకెళ్లారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, దేవీపట్నం గ్రామ కమిటీ అధ్యక్షులు కారం నాగమణి అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన ఉప సర్పంచ్ వెంకటేష్



ఉప సర్పంచ్ వెంకటేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇల్లా చిన్నారెడ్డి , తదితరులు

మోతుగూడెం/ చింతూరు మే 20 (ఆంధ్ర జ్యోతి): చింతూరు మండలం పేగ గ్రామ పంచాయతీ వైసీపీ ఉప సర్పంచ్ కరక వెంకటేష్ మంగళవారం టీడీపీలో చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి సమక్షంలో జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చింతూరు మండలం నుంచి ఇల్లా చిన్నారెడ్డి నాయకత్వంలో రంపచోడవరంలో జరిగే మినీ మహానాడుకు సుమారు 200 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎస్‌కే ఆసిఫ్, నర్సింహరావు చౌదరి, సురేష్, తునిక సత్యం పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పెద్దపండుగలా మినీ మహానాడు

• వర్షాన్ని లెక్కచేయకుండా తరలివచ్చిన పార్టీశ్రేణులు, జిల్లా నేతలు
• పలు సమస్యలపై తీర్మానాలు ప్రవేశపెట్టిన పార్టీ నాయకులు



మినీ మహానాడుకు హాజరైన మహిళలు

తునిరూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): తుని నియోజకర్గంలో ప్రభుత్వవిప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన జరిగిన మినీ మహానాడుకు వర్షం ఆటంకం సృష్టించినా మహాయజ్ఞంలా తలపెట్టిన మినీ మహానాడు వేదిక ఆగలేదు. వేదిక మార్చినా కార్యకర్తల జోరు ఏమాత్రం తగ్గలేదు. తుని పట్టణ శివారు సాయివేదిక ప్రాంగణంలో తుని నియోజకవర్గ టీడీపీ పెద్ద పండుగ మినీ మహానాడు అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీశ్రేణులతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లాకు చెందిన పలువురు కీలక నేతలు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం నాయకులు టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం తుని నియోజకవర్గ అభివృద్ధి గురించి పలువురు నాయకులు కీలక తీర్మానాలు సభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. అనంతరం ముఖ్యనేతలు ప్రసంగించారు. తుని నియోజకవర్గ టీడీపీ సీనియర్‌నేత యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్లలోవరాజు, యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మళ్ల గణేష్, మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ రూపాదేవి పాల్గొన్నారు.

• మహానాడులో తీర్మానాలు ఇవే

తాండవనదిపై రివర్‌బ్యాంక్ వెంబడి రిటర్నింగ్ వాల్ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ ప్రతిపాదనకు సభ ఆమోదం తెలిపింది.

● పంపా రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యను పెంచి కాలువను సిమ్మెంటు, కాంక్రీట్‌తో లైనింగ్ ఏర్పాటుచేసి 29షెట్టర్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని బి.శ్రీరామమూర్తి (చందు) ప్రతిపాదించగా సభ ఆమోదించింది

● పుష్కరకాలువ కాలువ నిర్మాణమై 20 సంవత్సరాలు గడచిన నేపథ్యంలో ఎక్కడికక్కడ పూడుకుపోయి షెట్టర్‌లు పాడయ్యాయని వీటిని సరిచేసి రైతులకు సాగునీరు అందించాలని తుని మండలానికి చెందిన సుర్ల లోవరాజు ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది.

● పోలవరం ప్రాజెక్టు ఎల్ఎంసీ ద్వారా వచ్చే గోదావరి నీటిని తుని వద్ద లిఫ్ట్ ఏర్పాటుచేసి తాండవ రిజర్వాయర్ ద్వారా కోటనందూరు మండలం తుని పట్టణంలో గల గ్రామాలకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని తునికి చెందిన చిటికెల శ్రీనివాస రావుకోరగా సభ ఆమోదించింది

● తుని పట్టణంలో 30 వార్డుల్లో 10 వార్డుల ప్రజలు రైల్వే ట్రాక్‌పైపు నివసిస్తున్నారని వీరు వివిధ అవసరాల కోసం కొండవారిపేట వద్ద ఉన్న తూము కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారని తూములో నిత్యం మురుగు నీరు నిండిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తుని పట్టణానికి చెందిన లంకా సునీల్ ప్రతిపాదించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అడగగా సభ ఆమోదించింది

● కోటనందూరు మండలానికి సాగునీరు అవసరాల కోసం ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న గ్రోయిన్‌లు పాడైపోయిన నేపథ్యంలో వాటి స్థానంలో ఆయకట్టు నిర్వహించి కోటనందూరు మండలంలోని గ్రామాలకు సాగునీరు అందించాలని ఆమండలానికి చెందిన పెంటకోట భాస్కర రావు ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది

●తుని నియోజకవర్గంలో కోన ఫారెస్ట్‌లో పలు గ్రామాలు తరుచూ ముంపునకు గురవుతున్నాయని సదరు గ్రామాలు వరదనీటి ముంపు గురి కాకుండా మెగా డ్రైన్ నిర్మాణం చేపట్టి నీటిని ఆర్‌సీసీ పైపులైన్ ద్వారా సముద్రంలో కలిసే చర్యలు చేపట్టాలని కోదాడ సమీపంలో గల ఉప్పు చెరువు నందు ఉన్న దురాక్రమణలు తొలగించి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీరు కల్పించాలని తొండంగి మండలానికి చెందిన కాలిబోయిన చంద్రరావు ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది.

● తునిపట్టణంలో 30వార్డులో అండర్ గ్రౌండ్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఓపెన్‌డ్రైన్స్ ఉం డటంవల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తునిపట్టణానికి చెంది న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.శోభారాణి ప్రతిపాదనకు సభఆమోదించింది

● కోన ప్రజలకు కేఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన ఫార్మాసుటికల్స్, కెమికల్ పరిశ్రమలవల్ల వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడుతుందని ఈస మస్యను పరిష్కరించి ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని మత్స్యకారులను ఆదుకోవాలని అప్పారావు, ముసలయ్య ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపారు

●ప్రస్తుతం ఉన్న బీచ్ రోడ్డు నుంచి అన్నవరం వరకు నాలుగు లైన్లరోడ్డు నిర్మించాలని అంగుళూరిసుధాకర్ ప్రతిపాదించగా సభ ఆమోదం లభించింది.

సమర్థవంతమైన నాయకురాలు ఎమ్మెల్యే దివ్య

● జిల్లా పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నవీన్

తుని ఎమ్మెల్యే యనమల దివ్య సమర్థవంతమైన నాయకురాలిగా ఆమె ఉన్నత స్థానానికి వెళ్లగలశక్తి సామర్థ్యాలు మొండుగా ఉన్నాయన్నారు. 10నెలల కాలంలోనే ఆమె ఎమ్మెల్యేగా ఎంతో పరిపక్వత సాధించారని భవిష్యత్‌లో ఆమె మరిన్ని పదవులు అధిరోహిస్తారన్నారు. తునిలో మహిళలకోసం కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యేను నవీన్ కోరారు.

పేదల ఉన్నతికి పాటుపడిన పార్టీ టీడీపీ : ఎమ్మెల్యే రాజప్ప

పేద ప్రజలఉన్నతికి పాటుపడిన పార్టీ టీడీపీఅని నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబా బువరకు పేద ప్రజలకోసం ఎన్నోపథకాలు ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లు, ఆయన నాయకత్వంలో ముందుకు వెళ్లడం ఆనందంగా ఉందన్నారు.

యనమల నాయకత్వంలో ముందుకు వెళతాం: ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

సీనియర్ నాయకులైన యనమల రామకృష్ణుడు తన కుటుంబానికి ఆది నుంచి అండగా ఉన్నారని ఆయన దిశా నిర్దేశంలో తన భర్త రాజా పనిచేశారని ఇప్పుడు తాను కూడా ఆయన సూచనలతో ముందుకు వెళతానని తెలిపారు. టీడీపీ ఒక మహావృక్షమని అలాంటి పార్టీ ప్రజలందరికీ మేలు చేసే పార్టీగా అభివర్ణించారు.



సభలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

మహిళాభ్యుదయానికి ఆద్యుడు ఎన్టీఆర్, చంద్రబాబు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

మహిళా రాజకీయ రిజర్వేషన్లు కల్పించి ఎన్టీఆర్ ఆరిక వరవతి కల్పిస్తే చంద్రబాబు మహిళాభ్యుదయానికి పాటుపడ్డారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. మహిళలు మహాశక్తిగా మారింది టీడీపీ ప్రభుత్వంలోనేనని ఆయన అన్నారు. మినీ మహానాడుకు ఇంతమంది మహిళలు తరలిరావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని ఎంతోమంది మహిళలు రాజకీయంగా ఉన్నత స్థానానికి వెళ్లారంటే అది టీడీపీ సంస్కరణల ఫలితమేనని యనమల అన్నారు. డ్వాక్రా సంఘాల రూపకల్పనద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించారని చెప్పారు.

తీర్మానం కమిటీ కన్వీనర్‌గా యనమల

టీడీపీ మహానాడు కమిటీల్లో కీలకమైన తీర్మానాల కమిటీ బాధ్యతను టీడీపీ పార్టీ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు భుజస్కందాలపై వేసింది. ఆయనను తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా వేసింది. మహానాడులో తీర్మానాల కమిటీ ప్రధానమైంది. పార్టీ దశదిశాలను నిర్దేశించి తీర్మానాల కమిటీకి యనమలను కన్వీనర్‌గా నియమించడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ప్రత్తిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా 4లేబర్ కోడ్‌లు తీసుకురావడంవల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తాయన్నారు. 29 కార్మిక చట్టాలు రద్దు కావడం జరుగుతుందని యజమానులకు శ్రామికులు శ్రమదోపిడీ చేసి ఊడిగంచేసే పరిస్థితులు తలెత్తుతాయని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు పి.రమణ, సీహెచ్ వెంకటలక్ష్మి, తులసి,కాంతం, భవానీ కుమారి, నాగసత్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

గండేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరుబండి చంద్రావతి హాజరై మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని స్కీంవర్కర్స్‌ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నొక్కు. లలిత, ఆశా నాయకులు శాంతి, విష్ణు, లక్ష్మి అంగన్ వాడీ నాయకులు వై.వీ.రాజేశ్వరి, అర్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ర్యాలీ

జగ్గంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లు తమకు సరైన న్యాయంచేస్తూ వారికి డిమాండ్లను నెరవేర్చాలని సీహెచ్ మంగ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ర్యాలీ మంగళవారం నిర్వహించారు. రాజపూడిలో నిర్వహించిన ర్యాలీ అనంతరం డిమాండ్ లైన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

జగ్గంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అభిమా నులు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట నాగేశ్వర థియేటర్‌లో యమదొంగ వేడుకలో పాల్గొని సినిమా చూశారు. అనంతరం జగ్గం పేట సెంటర్‌లో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుక లు నిర్వహించారు. టీడీపీ యువ నాయకు డు పాలచర్ల నాగేంద్రచౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండలం టీడీపీ అధ్యక్షుడు ఎం.భద్రం ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు పీలా మణికంఠ, గడ్డె కిషోర్, అల్లు సాయి రాం, సందక ప్రసాద్, మైపాల సుధా,దయా సాగర్, రాజేష్, శ్రీదేవి జగదీష్, అభిమానులు పాల్గొన్నారు

తప్పనిసరి ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేయాలి

తొండంగి, మే 10 (ఆంధ్రజ్యోతి): తప్పనిసరి బదిలీల్లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బదిలీలకు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలని ఎంఈవో షేక్ బాబ్జీ తెలిపారు. బదిలీల ప్రక్రియ ప్రారంభంకానున్నందున ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి వస్తున్న సూచనలు గమనించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జగ్గంపేటలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం

జగ్గంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పట్టణంలో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి సత్యనారాయణ, భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కాసీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. తుమ్మలపల్లి రమేష్ హాజరై అన్నదానాన్ని ప్రారంభించి పేదలకు వడ్డించారు. జగ్గంపేట నియోజకవర్గ జనసైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిర్లంపూడి ఎస్ఐకు సన్మానం

కిర్లంపూడి, మే 20(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కేసులు త్వరితగతిన పరిష్కరించి జిల్లాలో అతి తక్కువ కేసులు నమోదైన పోలీస్‌స్టేషన్‌గా కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ నిలిచింది. మంగళవారం ఎస్ఐ జి.సతీష్‌కుమార్, సిబ్బందిని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు.

'ఆదిత్య'లో ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

గండేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఏ.పి.ఈ.ఎ. పి.సెట్-2025 ఆన్‌లైన్ పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా జరిగినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రొ.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 240గాను 223 మంది హాజరు కాగా, 17 మంది హాజరు కాలేదు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 294గాను 274మంది హాజరుకాగా, 20మంది హాజరు కాలేదు. అలాగే సా యంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 240మంది హాజరు కాగా, 9 మంది హాజరు కాలేదు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 మందికిగాను 271 మంది హాజరుకాగా 24మంది హాజరుకాలేదు. ఈ ఎగ్జామ్స్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆదిత్య ప్రొ.ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, ప్రొ. ఎం.రాజబాబు, ప్రొ.టి.శ్రీనివాసులు, ప్రొ.వీరప్రసాద్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

హిందుత్వాన్ని బలోపేతం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఏలేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): హిందూమతాన్ని బలోపేతం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని జిల్లా విభాగ సభ్యులు రవిశంకర్ అన్నారు. రాష్ట్రీయ స్వ యం సేవక్ సంఘం నేతృత్వంలో జగ్గంపేట ఖండ నుంచి విచ్చేసిన 56మందికి ప్రైవేటు పాఠశాలలో మూడురోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. మంగళవారం రవిశంకర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ శత దినోత్సవం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నియోజక వర్గా లవారీగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. లింగేశ్వరరావు, ఏనుగు సుబ్రమణ్యం, రాతికింద కృష్ణారావు, జగదీష్, మురళి, అడపా రమణ, వీర భద్రరాజు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ బీజేపీ నాయకులు రాష్ట్ర ఎస్టీ సెల్ కమిషన్ కమిటీ చైర్మన్ గొల్లి భజరెడ్డిని కోరారు. నియోజకవర్గంలోని బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మట్టా మంగరాజు, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కించు జోగిరాజులు మంగళవారం రంపచోడవరం తరలివెళ్లి ఎస్టీ సెల్ కమిషన్ కమిటీ చైర్మన్ గొల్లి భజరెడ్డిని కలిశారు. వారు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన 50 గ్రామప్రజలు పడుతున్న అవస్థలను వివరించారు. అనంతరం చైర్మన్‌ను వారు ఘనంగా సన్మానించారు.

రాజకీయపార్టీలతో తహసీల్దార్ సమావేశం

జగ్గంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓ టరు నమోదు అధికారి, తహసీల్దార్ తన కార్యాలయంలో మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు, 18 ఏళ్లునిండిన వారికి కొత్తగా జారీచేసే ఓటరు గుర్తింపు కార్డులు, చనిపోయినవారి, డూప్లికేట్ ఓటర్ల తొలగింపుపై ఈ సమా టవేశంలో చర్చించారు.

మన్యం అభివృద్ధికి దిశానిర్దేశం టీడీపీయే

● రంపచోడవరం మినీ మహానాడులో దేశం నేతల ఉద్ఘాటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష, పక్కన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

రంపచోడవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మన్యం అభివృద్ధికి దిశానిర్దేశం టీడీపీయేనని ఆ పార్టీకి చెందిన రంపచోడవరం నియోజకవర్గ ముఖ్యనేతలు ఉద్ఘాటించారు. మంగళవారం రంపచోడవరంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష అధ్యక్షతన మినీ మహానాడు జరిగింది. నియోజకవర్గంలోని 11 మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి గత నాలుగు దశాబ్దాలుగా టీడీపీ అండగా నిలుస్తోందన్నారు. ముందుగా స్థానిక సెంటర్లోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్, వంతల రాజేశ్వరి, తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి రంపరోడ్డులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి పార్టీ శ్రేణులతో ర్యాలీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతిప్రజ్వలన చేశారు. మాజీఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదల పక్షపాతిగా టీడీపీ ఖ్యాతి చెందిందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బాబూ రమేష్, వంతల రాజేశ్వరి మాట్లాడుతూ టీడీపీ గిరిజనుల ఆదాయాన్ని పెంచిందని, ఎన్నో మౌలిక వసతులను కూడా గిరిజన ప్రాంతాలకు కల్పించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, వీఆర్‌పురం జడ్పీటీసీ రంగారెడ్డి, ఎటపాక వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు శివాజీరాజు, అడబాల బాపిరాజు, జి.పెద్దిరాజు, వెంకటరమణారెడ్డి, కరకా వెంకటరమణ, పాము అర్జున, గణజాల తాతారావు, ఇల్లా చిన్నారెడ్డి, జమాల్‌ఖాన్, కనిగిరి రాంబాబు, శైలం గంగాధరరావు, పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి,ఎడవల్లి భాస్కరరావు, ముప్పా శ్రీనివాసరావు, బొర్రా నరేష్, పండా చెల్లన్నదొర , తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు

మోతుగూడెం: రంపచోడవరంలో మినీ మహానాడు కార్యక్రమానికి చింతూరు మండలం మోతుగూడెం, వైరాముపరం మండలం డొంకరాయి టీడీపీ ఎంపీటీసీలు వేగి నాగేశ్వరరావు, కరకా వెంకటరమణ తరలివెళ్లారు. గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లు, మోతుగూడెంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వంటి పలు సమస్యలపై మాట్లాడారు. మోతుగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు దొడ్డి ఏసు వార్డు మెంబర్ బాలయ్య, టీడీపీ సీనియర్ నేతలు పాసి రమణ శ్రీనివాసరావు, కరణం శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో విడత భూసేకరణపై రేపు సమావేశం

మోతుగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లో త్వరలో చేపట్టబోయే రెండోవిడత భూసేకరణపై ఐటీడీఏ పీవో కార్యాలయంలో అధికారులు, గ్రామాల పెద్దలు, ప్రజలతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏపీవో కార్యాలయం తెలిపింది. చింతూరు డివిజన్‌లో ఆర్‌ఆర్ గ్రామ సభలు పూర్తికావడంతో పీవో ఆర్‌ఆర్ కాలనీలు, గిరిజనులకు భూమికి భూమికి, గృహనిర్మాణం, గిరిజనేతరులకు గృహాలు వంటి అంశాలపై వారితో చర్చిస్తారు. ఆర్‌ఆర్‌కి సంబంధించి గ్రామసభలో దరఖాస్తు ఇవ్వలేని నిర్వాసితులు ఈ సమావేశంలో దరఖాస్తులను సమర్పించుకోవచ్చు. పదిరోజులలో అన్ని గ్రామసభల దరఖాస్తులు వెరిఫికేషన్ పూర్తి చేస్తారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహశీల్దార్లు పాల్గొంటారు. అనంతరం పలు విషయాలపై చర్చిస్తారు.